క్లుప్తంగా...

నేడు 'ఊరూరా చెరువుల పండుగ'

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పీరంచెరువు కట్టపై నీటి పారుదల శాఖ 'ఊరూరా చెరువుల పండుగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ నిఖిలేష్ ప్రకటించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు కట్టపై గురువారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరుకానున్నట్లు సమాచారం. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

తొండుపల్లి చెరువు వద్ద..

శంషాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈరోజు మధ్యాహ్నం తొండుపల్లి చెరువు వద్ద మైసమ్మ అమ్మవారికి బోనాలు, జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు గొల్లపల్లి కౌన్సిలర్ చెన్నం అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పట్టణ ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు సమాచారం.

ఇంటర్మీడియట్ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

మణికొండ: సాంఘీక సంక్షేమశాఖ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఖాళీల భర్తీకి 2023 మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీవిద్యార్థులు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారదా వెంకటేష్ కోరారు. గ్రామీణ ప్రాంత తల్లితండ్రుల ఆదాయం సంవత్సరానికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత తల్లితండ్రుల ఆదాయం రూ.2 లక్షలు ఉండాలన్నారు. 31-08-2023 తేదీ నాటికి 17 ఏళ్లు మించరాదని దరఖాస్తుకు ఈ నెల 15 చివరి తేదీ అన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ నెల 15న విద్యుత్ సమస్యలపై సమావేశం

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 15 న సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, వినియోగదారులు హాజరుకానున్నారన్నారు. ఈ నెల 15 న మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారులు పాల్గొని దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు ఉండటం లేదు

శంషాబాద్: పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు జాబితా పనులను చేపట్టాల్సిన అధికారులు సరిగ్గా ఉండటం లేదని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. కొందరు బీఎల్‌ఓలుగా బాధ్యతలు తీసుకున్న అంగన్‌వాడీ టీచర్లు వారి ఉన్నతాధికారులు డ్యూటీలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పడంతో గైర్హాజరవుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు అంగన్‌వాడీలను సమన్వయం చేసుకోవడంలో విఫలమవుతున్న కారణంగా బీఎల్‌ఓల పనితీరు సరిగ్గా ఉండడం లేదని ఆయన ఆరోపించారు. దీనిపై రాజేంద్రనగర్ ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు.

'మనూ'లో 12న మెగా జాబ్‌మేళా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'జష్న్-ఏ-బహారన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉర్దూ యూనివర్సిటీ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్(టీఅండ్‌పీసీ) ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ యూసుఫ్‌ఖాన్ తెలిపారు. ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, గెలాక్సీ ప్లేస్‌మెంట్ సర్వీసెస్, అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) సంయుక్తంగా మేళా నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక, సాహిత్య, క్రీడా ఉత్సవం 'జష్న్-ఏ-మహారన్-2023'లో భాగంగా ఈ ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 50 కంపెనీలు, సంస్థలు, ఎంఎన్‌సీలు, ఫెడరేషన్లు, సుమారు నాలుగు వేల ఖాళీలను భర్తీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఆలయాల అభివృద్ధికి కృషి

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఆలయాల అభివృద్ధికి స్థానికుల సహకారంతో కృషి చేస్తానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బుధవారం ఆయన బాంజవాడిలోని శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ గుడిమల్కాపూర్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. దానిని ముందుందు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు సుందరీకరణ..
మరోవైపు ఆక్రమణలు !



పరివాహక ప్రాంతంలో మట్టిపోసి ఇలా ..



మూసీనదిలో జరుగుతున్న అభివృద్ధి పనులు



అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన షట్టర్లు

అత్తాపూర్: అత్తాపూర్ నుంచి మూసీ కాలువను ఆనుకుని లంగర్‌హౌజ్ బ్రిడ్జికి అనుసంధానం చేసిన రోడ్డు మార్గం ప్రయాణికులకు సౌకర్యంగా మారింది. ఈ రోడ్డు మార్గం రద్దీగా మారడంతో ఓ వైపు మూసీ.. మరో వైపు భూ అక్రమదారులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలున్నాయి. మూసీ సుందరీకరణలో భాగంగా నూతనంగా మూసీ నది కాలువలో కొన్ని ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగానే అత్తాపూర్ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణంతో పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఓ వైపు అభివృద్ధి పనులు మరోవైపు మూసీ కాలువలో ట్రాలీలతో మట్టిని పోస్తూ.. ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మూసీ కాలువకు ఓ వైపు పెద్దఎత్తున మెకానిక్ గ్యారేజీలు, మరోవైపు గ్రీనరీ పేరుతో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ.. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ మూసీ కాలువ సమీపంలో ఆక్రమణలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాగునీటి దినోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ వాలంతరీ ఇరిగేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో సాగునీటి దినోత్సవాన్ని నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత రైతన్నలకు వేసవికాలంలో నీరు నిండుగా ఉంటూ.. పంటలను పడించుకుంటున్నారన్నారు. ఆర్డీఓ చంద్రకళ, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, శంషాబాద్ మున్సిపల్ చైర్మన్ సుష్మ మహేందర్‌రెడ్డి, రేఖాయాదగిరి, వెంకటేష్‌గౌడ్, జెడ్పీటీసీ తనీ్వరాజు, ఎంపీపీ జయమ్మ, నీటి పారుదల అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, పాపయ్య యాదవ్, సయ్యద్‌ఖాజా, రజాక్, అంతారం నరేష్, వెంకటేష్, రాజునాయక్ తదితరులున్నారు.

ఇంటి ఆవరణలోని స్తంభాన్ని తొలగించండి !

శంషాబాద్ : ఇంటి ఆవరణలో ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని విద్యుత్ అధికారులను పలువురు నేతలు కోరారు. పట్టణంలోని 14వ వార్డులోని లక్ష్మికి ఉన్న అరవై గజాల స్థలంలో ఓ గదిని నిర్మించుకోగా మిగతా స్థలంలో స్తంభం అడ్డుగా ఉండటంతో ఇల్లుకట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని కోరారు. దీనిపై అనేకసార్లు అధికారులకు విన్నవించగా.. వారు ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగించడం దారుణమని బీజేపీ నేతలు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, అంజి, ధన్‌పాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులున్నారు.



నైపుణ్యానికి తగినట్లుగా విద్యా బోధన



ఉస్మానియా ప్రొఫెసర్‌లతో విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీసతీష్, విద్యార్థులు

రాజేంద్రనగర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విజ్ఞాన్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలు పనిచేస్తున్నాయని కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. ఉస్మానియా ప్రొఫెసర్లతో పలు సబ్జెక్టులపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించి దానికనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. అత్తాపూర్, బండ్లగూడ, శంషాబాద్ ప్రాంతాల్లోని విజ్ఞాన్ ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యను అందించేందుకు కళాశాల యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే ప్రతి ఏటా ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు దోహదపడుతున్నాయన్నారు. ప్రతి విద్యా సంవత్సరం మల్టీనేషనల్ కంపెనీలతో చర్చించి జాబ్ మేళాలను నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.



జాబ్‌మేళాలో విద్యార్థులతో కళాశాల చైర్మన్

కూచిపూడిలో ప్రతిభ కనబరిచిన అక్షరకు సత్కారం



సత్కరిస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

బండ్లగూడ: చిన్న వయస్సులోనే తెలుగువారి సంప్రదాయ నృత్యం కూచిపూడిలో అద్భుత ప్రతిభ కనబరిచి కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖలోని (సీసీఆర్‌టీ) స్కాలర్‌షిప్ సాధించిన దేవళ్ల అక్షరను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఏటా 10-14 ఏళ్లలోపు సంప్రదాయ నృత్యాలను నేర్చుకుంటున్న విద్యార్థులకు దేశవ్యాప్తంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి కేంద్ర, సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఎంపిక చేస్తుందన్నారు. వేలాది మంది హాజరైన ఈ టెస్ట్‌లో అర్హత సాధించిన అతి తక్కువ మందిలో అక్షర ఉండటం గర్వకారణమన్నారు. అక్షర ప్రతిభకు గుర్తింపుగా బాలరత్న, నాట్య కిరణం, వండర్ కిడ్, నాట్య శికామణి, నర్తన మయూరి, అమేజింగ్ కిడ్ తదితర పురస్కారాలు అందుకుందన్నారు. ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు సుధాకర్, నదీమ్, నరేందర్‌బాబు, ప్రమీల, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ సొసైటీ సేవలు అభినందనీయం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శివరాంపల్లి వేదికగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు విశేష సేవలందిస్తున్న తలసీమియా సికిల్ సెల్ సొసైటీని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ జనాబ్ డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసి అభినందించారు. బుధవారం సొసైటీలోని సౌకర్యాలు, రోగులకు అందించిన కీలకమైన సేవలను ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఆరోగ్య సవాళ్లలో తలసీమియా ప్రధానమైనదని బాధితులకు సమగ్ర సంరక్షణ, మద్దతు అందించడం మన బాధ్యత అని అన్నారు. ఈ వేదిక ద్వారా నిబద్ధతతో తలసీమియా బాధితులకు సేవలందించడం అభినందనీయమన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా తలసీమియా రహిత సమాజంగా మార్చేందుకు అందరికీ హెచ్‌బీఏ-2 పరీక్షను తప్పనిసరి చేయడంలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ ప్యాట్రన్ నరేష్ రాఠీ, వైస్ ప్రెసిడెంట్ రత్నావళి, సీఈఓ డాక్టర్ సుమన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు



విద్యాధికారి రామిరెడ్డి

అత్తాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతం కావడంలో తల్లిదండ్రులు, విద్యాకమిటీ, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో బుధవారం వరకు 183 మంది విద్యార్థులు ఆయా తరగతుల్లో అడ్మిషన్లు పొందినట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఉత్తమ ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియంతో బోధనలతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కూడా ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని జూన్12 నాటికి విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు.

మహాసభలను విజయవంతం చేయండి



వనంపల్లి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 3వ మహాసభలు మేడ్చల్‌జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా కాటేదాన్ ప్రాంతానికి చెందిన జైపాల్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాడుతామన్నారు. రాష్ట్ర మహాసభలు ఈ నెల 6,7వ తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

స్టీరింగ్ లాక్‌తో డివైడర్‌ను ఢీకొన్న కారు

రాయదుర్గం: రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని వైకుంఠ మహాప్రస్థానం సమీపంలో బుధవారం ఓ కారు అకస్మాతుగా స్టీరింగ్ లాక్ కావడంతో డివైడర్‌ను ఢీ కొట్టింది. పెద్ద ప్రమాదం కాకపోవడంతో కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన

రాయదుర్గం: మహిళలు, యువతులు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని సైబరాబాద్ డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూ డీసీపీ నితికా పంత్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్ విజిట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు విమెన్ అండ్ చైల్డ్ అండ్ సేఫ్టీ వింగ్ డీసీపీ నితికాపంత్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ విజిట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ హౌస్ విజిట్‌లో భాగంగా వివిధ కళాశాలలకు చెందిన 110 మంది విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థినులకు విమెన్ పోలీస్ స్టేషన్, షీ-టీమ్ పోలీస్ స్టేషన్లు, భరోసా కేంద్రాలను పనితీరును వివరిస్తూ వాటి ప్రాముఖ్యాన్ని వివరించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు, చిన్నారులకు సైబరాబాద్ పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థినులు సందేహాలను నితికాపంత్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశం, వేణుమాధవ్, విమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునీత పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను శిక్షించాలి



నిరసనలో ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను వెంటనే పదవీ నుంచి తొలగించాలని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీ లారీ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ యూనియన్ సమక్షంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే పదవీ నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. శాంతియుతంగా తమపై వేధింపులకు గురిచేసిన మంత్రిని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని ఢిల్లీలో నిరసన ర్యాలీలు, ధర్నాలు చేస్తున్న కేంద్రప్రభుత్వం పట్టించుకోకుండా ఇప్పటి వరకు అతనిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అతడిని వెంటనే అరెస్టు చేసి సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరారు. గండిపేట్ మండల రోడ్డు ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, బాలరాజ్, బలరాం, వెంకట్, ప్రసాద్, వెంకటయ్య తదితరులున్నారు.

నిషేధం ప్రకటించినా చలామణీ !

అత్తాపూర్: పర్యావరణానికి హాని కలిగిస్తున్న ఒకసారి వాడేసిన ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రకటించిన నిషేధం అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమదారుల్లో ప్లాస్టిక్ పరిశ్రమల యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ బ్యాగులను టన్నుల కొద్ది తయారు చేస్తూ.. మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి. 50 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లను నిషేధించారు. ఓసారి వాడిపాడేసిన ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 25 రకాల వస్తువులను నిషేధిస్తూ.. కేంద్ర పర్యావరణశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంతో ప్లాస్టిక్ పరిశ్రమలదారులు ప్లాస్టిక్ కవర్లను తయారు చేయడంలో వెనక్కి తగ్గలేదు. దీంతో చిరువ్యాపారస్తులు కూడా ప్లాస్టిక్ కవర్లలోనే ప్యాకింగ్ చేసి వినియోగదారులకు వస్తువులను అందిస్తున్నారు. ప్లాస్టిక్ పరిశ్రమలపై నిషేధం ఉన్నా ఆ పరిశ్రమలు ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తి చేయకపోతే మార్కెట్‌లో ఎలా దొరుకుతాయని చిరువ్యాపారస్తులు ప్రశ్నిస్తున్నారు. కాటేదాన్ ప్రాంతంలో ప్లాస్టిక్ సంచుల తయారీ పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా నడుపుతూ.. పెద్దఎత్తున మార్కెట్‌లో విక్రయిస్తున్నారని సమాచారం. జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచుల్లోనే చిరువ్యాపారస్తులు సరుకులను వినియోగదారులకు అందిస్తున్నారు.

క్రీడాకారులకు ధ్రువపత్రాల అందజేత



క్రీడాకారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం

మణికొండ: రెజ్లింగ్ క్రీడను నేర్చుకుంటే ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ అలవడటంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ అన్నారు. నార్సింగిలో గత నెల రోజులుగా కొనసాగిన సమ్మర్ కోచింగ్ ముగియడంతో క్రీడాకారులకు ఆయన బుధవారం ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెజ్లింగ్ క్రీడ అతి పురాతనమైనదని దానిలో రాణిస్తేనే అనేక రంగాల్లో ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందుతుందన్నారు. ఇలాంటి క్రీడను ఎంచుకుని రాణిస్తేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. రెజ్లింగ్ కోచ్ కొల్లూరు రాజ్‌కుమార్‌ముదిరాజ్, నాయకులు ఆనంద్, కైలాష్, ప్రశాంత్, నవీన్, సురేష్, సురేష్‌రెడ్డి, మహ్మద్ తదితరులున్నారు.

వేతనాలు చెల్లించడంలో మోసం.. ముగ్గురిపై కేసు

శంషాబాద్: అక్రమంగా ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు ఉద్యోగులకు అందించాల్సిన పూర్తి వేతనంలో కొంత కోత పెట్టి తమ సొంతానికి వాడుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. ఎయిర్‌పోర్టులోని ఎల్ఎల్‌పీ పోర్టర్ సర్వీసులో శంషాబాద్ మధురానగర్ బస్తీకి చెందిన ఎన్. కిరణ్ పోర్టర్‌గా పనిచేశాడు. ఉద్యోగంలో చేరే సమయంలో వేతనం రూ.11,082 చెప్పి చేర్చుకున్నారని ఇటీవల కారణం లేకుండా ఉద్యోగం నుంచి తొలగించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. తాను పనిచేసిన కాలంలో తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుని కేవలం రూ.7 వేలు మాత్రమే చెల్లించిన ఎండీ, ఇతర అధికారులపై బాధితుడు లేబర్ కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎకో చాంపియన్ హాకథాన్‌లో జీఎన్‌ఐటీఎస్ సత్తా

గోల్కొండ: సంస్థ కళాశాల విద్యార్థినులు అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటున్నారని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఎన్విరాన్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త నిర్వహించిన ఎకో చాంపియన్ హాకథాన్‌లో జీఎన్‌ఐటీఎస్‌కు చెందిన విద్యార్థినులు 3వ బహుమతిని పొందారు. ఈ నేపథ్యంలో వారిని కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... కళాశాల వివిధ విభాగాలలో అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన చేస్తున్నామని, అదే విధంగా వివిధ క్రీడాంశాలలో సైతం అత్యుత్తమ కోచ్‌లను నియమించామన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు రాకేష్ గౌడ్, బి. వికాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

విజయనగర్‌కాలనీ: చేపల పెంపకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సహించడంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలంగాణ మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. విజయనగర్‌కాలనీ శాంతినగర్ రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాల తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే చేపప్రసాదం పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చేప ప్రసాదం కోసం అవసరమైన కొరమీను చేపపిల్లలను సేకరించి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ అభివృద్ధే ధ్యేయంగా అమలుపరుస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత చేపల ఉత్పత్తి రెట్టింపు అయ్యిందన్నారు. పెరిగిన ఉత్పత్తికి అనుగుణంగా వినియోగాన్ని పెంచేందుకు రుచి, ఆరోగ్యకరమైన చేపల వంటకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పెరిగిన మత్స్య సంపదను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు సబ్సిడీపై మత్స్యకారులకు వివిధ రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.